# సాక్షి
## కామారెడ్డి

శుక్రవారం । 3 । నవంబర్ । 2023






### ధాన్యం దళారుల పాలు
కొనుగోలు కేంద్రాలలో విక్రయిస్తే సకాలంలో డబ్బులు రావేమోనన్న ఆందోళనతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.
- IIIలో ▸



### సద్వినియోగం చేసుకోవాలి
రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.
- IIIలో ▸

### వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3 /16.2
ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

## న్యూస్‌రీల్


### నేడు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన
**కామారెడ్డి టౌన్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించే పార్టీ పోలింగ్ బూత్ విజయ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై పొందుర్తి వద్ద స్వాగతం పలికేందుకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు. అక్కడినుంచి రాజారెడ్డి గార్డెన్స్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ అభ్యర్థి కాటిపల్లి వెంకట రమణారెడ్డి కార్యకర్తలను కోరారు.

### ఎన్నికల పరిశీలకుల నియామకం
**కామారెడ్డి క్రైం:** అసెంబ్లీ ఎన్నికల కోసం ఎలక్షన్ కమిషన్ నియోజకవర్గాలకు పరిశీలకులను నియమించింది. జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులుగా పరా శివమూర్తి (ఐఆర్‌ఎస్) నియమితులయ్యారు. ఎల్లారెడ్డి సాధారణ ఎన్నికల పరిశీలకులుగా జి.జగదీష, కామారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలకు సంబంధించి శైలేష్ కుమార్ చౌరాసియా, బాన్సువాడకు లలిత్‌నారాయణ్ సింగ్ సందులను నియమించారు. జిల్లా పోలీస్ అబ్జర్వర్‌గా అబ్దుల్ ఖయ్యూంను నియమిస్తూ ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. పరిశీలకు ల బస కోసం జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాట్లు చేశారు. వారు ఎన్నికలు పూర్తయ్యేవరకు జిల్లాలో ఉండి ఎన్నికల తీరు, అభ్యర్థుల ఖర్చులు, ప్రవర్తనా నియమావళి అమలు, శాంతి భద్రతలు అదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించనున్నారు. కాగా వ్యయ పరిశీలకులుగా నియమితులైన పరా శివమూర్తి గురువారమే జిల్లాకు చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్, ఎస్పీ స్వాగతం పలికారు. మిగతావారు శుక్రవారం రానున్నారు.

### 'సరిహద్దుల్లో పటిష్ట నిఘా'


**నిజాంసాగర్:** తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులలో పటిష్ట నిఘా ఉంచాలని కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల ఎస్పీలు సింధు శర్మ, రూపేష్ సూచించారు. గురువారం అచ్చంపేట గెస్ట్‌హౌస్‌లో సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లోని సరిహద్దు డివిజన్ల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం వారు నర్సింగ్‌రావ్‌పల్లి చౌరస్తా వద్ద నాందేడ్- సంగారెడ్డి జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి డబ్బు, మద్యం రవాణా కాకుండా కట్టడి చేయాలని సిబ్బందికి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట బాన్సువాడ డీఎస్పీ జగన్నాథ రెడ్డి, బాన్సువాడ రూరల్ సీఐ మురళి, నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ ఉన్నారు.

### నేటి నుంచి రేషన్ బియ్యం పంపిణీ
**కామారెడ్డి రూరల్:** రేషన్ షాపుల ద్వారా ఈ నెలకు సంబంధించిన బియ్యం పంపిణీ శుక్రవారం నుంచి ప్రారంభమవుతుందని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్ తెలిపారు. ఆహారభద్రత కార్డులపై ఒక్కో యూనిట్‌కు 6 కిలోలు, అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

### 'ఇంటిపన్నులు 62 శాతం వసూలయ్యాయి'


**నాగిరెడ్డిపేట:** జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇప్పటివరకు 62 శాతం ఇంటిపన్నులు వసూలు చేసినట్లు డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన నాగిరెడ్డిపేట ఈ–పంచాయతీని సందర్శించి, రికార్డులను, ఇటీవల ఈ–పంచాయతీలో ప్రవేశపెట్టిన జెమ్ పోర్టల్ పనితీరును పరిశీలించారు. అనంతరం పోచారం జీపీని తనిఖీ చేసి, ఇప్పటివరకు వసూలైన పన్నుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ ఏడాది రూ.9.9 కోట్ల ఇంటిపన్నులు వసూలు చేయాలన్నది లక్ష్యం కాగా ఇప్పటికి రూ. 6.13 కోట్లు వసూలు చేశామన్నారు. డిసెంబర్ చివరి వరకు వందశాతం పన్నులు వసూలు చేస్తామన్నారు. ఆయనవెంట ఎంపీడీవో రఘు, ఎంపీవో శ్రీనివాస్ ఉన్నారు.



వేల్పూర్‌లో ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మంత్రి ప్రశాంత్ రెడ్డి



## పథకాలు ఇవీ..
# ఓటు నిర్ణయం మీదే!

- వేల్పూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్
- రూ. రెండువేల పింఛన్ నా నిర్ణయమే..
- పింఛన్ రూ. 5 వేలకు, రైతు బంధు రూ.12 వేలకు పెంచుతాం..
- కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు చేసిందేమీ లేదు..



**తమ తొమ్మిదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసిన** పథకాలను సీఎం కేసీఆర్ వివరించారు. కొత్తగా పెంచబోయే పింఛన్‌లు, రైతుబంధు సాయం, బీమా పథకాలపై హామీ ఇచ్చారు. ఇక ఓటు నిర్ణయం మీదేనని ప్రజలకు వదిలివేశారు. బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ శివారులోని స్పైసిస్ పార్క్ ప్రాంగణంలో గురువారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం అరగంటసేపు ప్రసంగించారు. – సాక్షి ప్రతినిధి, నిజామాబాద్, మోర్తాడ్

వేల్పూర్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. 2014 ఎన్నికల సమయంలో మేనిఫెస్టో తయారు చేసేటప్పుడు పింఛన్ల విషయంలో తీవ్ర చర్చ జరిగింది. గత ప్రభుత్వాలు రూ.70, రూ.200 ఇస్తే తెలంగాణ ఆవిర్భావం తరువాత రూ.500 ఇవ్వాలని కొందరు మేధావులు సూచించారు. అయితే పెరిగిన ధరలతో పోల్చితే ఇంత తక్కువ మొత్తం సరిపోతాయా అని భావించి తానే స్వయంగా రూ.వెయ్యి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నానని వెల్లడించారు. ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు బాగుపడటంతో పింఛన్‌ను రూ.2 వేలకు పెంచామన్నారు. ఇక నుంచి సంవత్సరానికి కొంత పెంచుతూ పింఛన్‌ను రూ.5 వేల వరకు ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు. రైతుబంధు పథకాన్ని కూడా రూ.12 వేలకు పెంచబోతున్నామన్నారు.

**ఎన్నికల తీరుపై ఆవేదన..**
స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడచినా ప్రజాస్వామ్యం పరిణతి చెందలేదని, ఎన్నికలు అంటేనే అబద్ధాలు వల్లించడం, దొడ్డిదారిలో అధికారంలోకి రావాలని ఆరాటపడటం జరుగుతోందని ప్రస్తుత పరిస్థితుల్లో సీఎం తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి చెందిన దేశాల్లో టీవీల్లో ప్రసంగాలు ఇచ్చి ప్రచారం చేస్తున్నారని, అక్కడ సభలను కేవలం 6 వేల మంది ప్రజలతోనే సరిపెడతారన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీజేపీలు ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. బీఆర్‌ఎస్ వచ్చిన తరువాత ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయో ప్రజలు గుర్తించాలన్నారు. ఓటు వేసే ముందు ఏ పార్టీ అభ్యర్థి మేలు, అభ్యర్థికంటే ఆయన వెనుక ఉన్న పార్టీ ఎలాంటిదో గుర్తించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మా సుట్టపోడు చెప్పిండనో, లేక దోస్తులు చెప్పింద్రనో విని చెడిపోకుండా మంచి ఆలోచన చేసి ఓట్లు వేయాలన్నారు.

**రైతులపై కాల్పుల చరిత్ర వారిది...**
ఎర్రజొన్న రైతులపై కాల్పులు జరిపించిన చరిత్ర ప్రతిపక్ష పార్టీదని పరోక్షంగా కాంగ్రెస్‌ను సీఎం ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాతనే రూ.15 కోట్ల వరకు బకాయిలు చెల్లించామన్నారు. మధ్యప్రదేశ్, గుజరాత్‌లలో ఇప్పటికీ రైతులు ఎరువుల కోసం క్యూ కట్టే పరిస్థితి ఉందన్నారు. తెలంగాణలో అలాంటి దుస్థితి ఎప్పుడో దూరమైందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోలు చేసి పది రోజుల్లో డబ్బులు జమ చేసే ప్రభుత్వం తమదే అన్నారు. ఇప్పటి వరకు రూ. 3 కోట్ల టన్నుల ధాన్యం పండుతోందని, సీతారామ, పాలమూరు ప్రాజెక్టులు పూర్తయితే 4 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగబోతుందని అన్నారు.



సభలో పాటకు నృత్యం చేస్తున్న జీవన్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

**విద్యుత్ సమస్యలను పరిష్కరించి...**
గతంలో ట్రాన్స్‌ఫార్మర్ కావాలంటే ఎన్నో పైరవీలు చేసేవారని, ఇప్పుడు ఏ పైరవీలు లేకుండానే సబ్ స్టేషన్‌లను మంజూరు చేస్తున్నామని సీఎం తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో 18 సబ్ స్టేషన్‌లను మంజూరు చేశామని, ఇంకా కొత్తవి ఎన్నికల తరువాత పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

**మోతెను మురిపించిన సీఎం..**
వేల్పూర్ మండలం మోతె గ్రామంతో తనకు, తెలంగాణ ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని సీఎం మరోసారి గుర్తు చేసుకున్నారు. ప్రసంగం ఆరంభంలోనే మోతె పేరును ప్రస్తావించి ఉద్యమ సమయంలో మోతె తనవెన్నంటి నడిచిందని, మోతె మట్టిని ముడుపుకట్టి హైదరాబాద్ తీసుకువెళ్లానని సీఎం చెప్పారు. మోతె మట్టికి అంతటి శక్తి ఉందని తెలంగాణ ఆవిర్భావం తరువాత ఆ మట్టిని తీసుకువచ్చి మళ్లీ ఇక్కడే కలిపామని చెప్పారు. మోతె పేరును సీఎం ప్రజా ఆశీర్వాద సభలో హోరెత్తించడం విశేషం.

**ప్రశాంత్‌రెడ్డికి మరోమారు..**
ప్రశాంత్ రెడ్డి తనకు కొడుకులాంటి వాడని, ఎన్నికలయ్యాక ఏర్పడే కొత్త ప్రభుత్వంలోనూ ప్రశాంత్‌రెడ్డి అదే పెద్ద మనిషి హోదాలో ఉంటాడని సభా ముఖంగా సీఎం కేసీఆర్ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.



సభకు హాజరైన బీఆర్‌ఎస్ కార్యకర్తలు

### నియోజకవర్గ సమస్యలు తీర్చండి


**వేల్పూర్:** బాల్కొండ నియోజకవర్గ సమస్యలు తీర్చాలని వేల్పూర్ స్పైస్‌పార్కులో గురువారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్‌కు మంత్రి ప్రశాంత్ రెడ్డి విన్నవించారు. లింబాద్రిగుట్ట శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేయడానికి మరిన్ని నిధులు అవసరమని, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతల పథకానికి సిమెంట్ పైప్‌లైన్ ఉందని, దాని స్థానంలో స్టీల్ పైప్‌లైను, వేల్పూర్ మండల కేంద్రానికి జూనియర్ కళాశాల మంజూరు చేయాలని కోరారు. ఎస్సారెస్పీ చుట్టు పక్కల టూరిజంను అభివృద్ధి చేయాలని, బాల్కొండను మున్సిపాలిటీగా మార్చాలని కోరారు. నియోజకవర్గంలో రహత్‌నగర్, వాడి కొత్తపల్లి, బస్సాపూర్ గ్రామాల్లో విద్యుత్తు సబ్‌స్టేషన్‌లు మంజూరు చేయాలన్నారు. మరో 5వేల డబుల్‌బెడ్‌రూం ఇల్లు, గృహలక్ష్మి ద్వారా మరో 3వేల ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. కొత్తగా పీఎఫ్ నంబర్లు పొందిన బీడీ కార్మికులకు పింఛన్లు ఇవ్వాలన్నారు. వచ్చే ప్రభుత్వంలో ప్రశాంత్‌రెడ్డి చెప్పిన పనులన్నీ పూర్తవుతాయని సీఎం కేసీఆర్ ఆయన ప్రసంగంలో పేర్కొన్నారు.

# నోటిఫికేషన్‌కు వేళాయె!



కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం





మద్నూర్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయం

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- ఏర్పాట్లు చేసిన యంత్రాంగం

**సాక్షి, కామారెడ్డి:** ఎన్నికల సంగ్రామంలో కీలకమైన నామినేషన్ల ఘట్టానికి వేళయ్యింది. శుక్రవారం నోటిఫికేషన్ వెలువడనుంది. శుక్రవారం నుంచి 10వ తేదీ వరకు రోజూ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. నామినేషన్ల కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. అభ్యర్థి వెంట నలుగురిని మాత్రమే కేంద్రంలోకి అనుమతిస్తారు.

**అందరి దృష్టి కామారెడ్డి మీదే..**
ముఖ్యమంత్రి కేసీఆర్ పోటీ చేస్తుండడంతో అందరి దృష్టి కామారెడ్డి నియోజకవర్గం మీదే కేంద్రీకృతమైంది. ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా జెడ్పీ మాజీ చైర్మన్ కాటిపల్లి వెంకటరమణారెడ్డి బరిలో ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎవరో ఇంకా తేలలేదు. కాగా డిమాండ్ల సాధన కోసం వివిధ వర్గాలు కామారెడ్డి బరిలో నిలవాలని నిర్ణయించాయి. ఎస్టీ రిజర్వేషన్ల కోసం లబాన్ లంబాడీలు, సమస్యల పరిష్కారం కోసం పౌల్ట్రీ రైతులు, నిరుద్యోగులు, మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు.. ఇలా వివిధ వర్గాలు పోటీ చేయాలని భావిస్తున్నాయి. కాగా నామినేషన్ల ఘట్టం శుక్రవారం ప్రారంభమవుతుండగా.. బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం నామినేషన్ వేయాలని నిర్ణయించారు. సీఎం కేసీఆర్ ఈనెల 9వ తేదీన నామినేషన్ దాఖలు చేయనున్నారు. మిగతా అభ్యర్థులు ఇంకా ముహూర్తం ఖరారు చేసుకోలేదు.

**'నేడు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల'**
**కామారెడ్డి క్రైం:** శాసనసభ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13న నామినేషన్ల పరిశీలన, 15 న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం అదేరోజు అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేశామని వివరించారు. నామినేషన్ పత్రాలు నింపడంలో అభ్యర్థులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రతి నామినేషన్ కేంద్రంలో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. నామినేషన్ రోజే అభ్యర్థులు ప్రత్యేక బ్యాంకు ఖాతా తెరిచి, దాని నుంచే ఎన్నికల ఖర్చులను నిర్వహించాలని సూచించారు. వాటి వివరాలను సైతం సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేయాలని తెలిపారు.

### రేపే పోచారం నామినేషన్
**బాన్సువాడ:** బాన్సువాడ బీఆర్‌ఎస్ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం బాన్సువాడలో నామినేషన్ వేయనున్నారు. ముందుగా ఆయన తిమ్మాపూర్ వెళ్లి తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తారు. అనంతరం 7007 అంబాసిడర్ కారులో బాన్సువాడ ఆర్డీవో కార్యాలయానికి వచ్చి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పిస్తారని పార్టీ నాయకులు తెలిపారు. నామినేషన్ అనంతరం బీర్కూర్, తిమ్మాపూర్, కిష్టాపూర్, చించోల్లి గ్రామాల్లో ఆయన ప్రచారంలో పాల్గొంటారన్నారు.

### నాలుగు నియోజకవర్గాల పరిధిలో..
జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో నామినేషన్ల స్వీకరణకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిధిలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలుండగా, నిజామాబాద్ ఎన్నికల అధికారి పరిధిలో బాన్సువాడ ఉంది. నామినేషన్ల స్వీకరణ కోసం ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.

### నామినేషన్లు స్వీకరించే కేంద్రాల వివరాలు..

| నియోజకవర్గం | నామినేషన్ కేంద్రం | రిటర్నింగ్ అధికారి |
|---|---|---|
| కామారెడ్డి | ఆర్డీవో కార్యాలయం | శ్రీనివాస్‌రెడ్డి |
| జుక్కల్ | మద్నూర్ తహసీల్ ఆఫీస్ | మనుచౌదరి |
| ఎల్లారెడ్డి | ఎల్లారెడ్డి తహసీల్ ఆఫీస్ | మన్నె ప్రభాకర్ |
| బాన్సువాడ | ఆర్డీవో కార్యాలయం | భుజంగరావ్ |

## బాన్సువాడ బీజేపీ అభ్యర్థిగా యెండల

- నిజామాబాద్ రూరల్ టికెట్టు కులాచారి దినేశ్‌కు..
- బోధన్‌లో వడ్డి మోహన్‌రెడ్డికి అవకాశం
- పెండింగ్‌లో ఎల్లారెడ్డి అభ్యర్థిత్వం



యెండల



మోహన్‌రెడ్డి



దినేశ్

**సాక్షి, కామారెడ్డి:** అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులకు సంబంధించి భారతీయ జనతా పార్టీ గురువారం మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించిన మూడు స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. బాన్సువాడ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేరు ప్రకటించింది. నిజామాబాద్ రూరల్ టికెట్టు కులాచారి దినేశ్‌కు, బోధన్ టికెట్టు వడ్డి మోహన్‌రెడ్డికి కేటాయించింది. కాగా మొదటి జాబితాలో కామారెడ్డి నుంచి కాటిపల్లి వెంకటరమణారెడ్డి, జుక్కల్ నుంచి అరుణతార, బాల్కొండ నుంచి అన్నపూర్ణ, ఆర్మూర్‌నుంచి రాకేశ్‌రెడ్డి పేర్లను ప్రకటించిన విషయం తెలిసిందే.. ఇంకా ఎల్లారెడ్డి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరిన వడ్డెపల్లి సుభాష్‌రెడ్డికి బీజేపీ టికెట్టు కేటాయించే అవకాశాలున్నాయి.

బాన్సువాడలో బీజేపీ టికెట్టు మాల్యాద్రిరెడ్డికి వస్తుందని భావించారు. అయితే ఆయన ఇటీవల కాంగ్రెస తీర్థం పుచ్చుకున్నారు. దీంతో ప్రత్యామ్నాయంగా నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ పేరును ఖరారు చేశారు.

## 'కేసీఆర్‌పై 100 నామినేషన్లు వేస్తాం'

**కామారెడ్డి టౌన్:** సమస్యల పరిష్కారం కోసం సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా 100 నామినేషన్లు వేయనున్నట్లు జిల్లా పౌల్ట్రీ ఫాం రైతుల అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి సంఘం భవనంలో పౌల్ట్రీ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ ఓన్ ఫార్మర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రావు, ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కార్పొరేట్ పౌల్ట్రీ శక్తుల తీరుతో పౌల్ట్రీ రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పౌల్ట్రీని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేస్తున్న మక్కలను పౌల్ట్రీ రంగానికి 28 శాతం సబ్సిడీపై ఇవ్వాలని కోరారు. పౌల్ట్రీ ధరలను రైతులే నిర్ణయించేలా అవకాశం కల్పించాలన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కామారెడ్డిలో 100 నామినేషన్లు వేయాలని నిర్ణయించామన్నారు. శుక్రవారం నుంచి నామినేషన్లు వేస్తామన్నారు. చికెన్ సెంటర్స్ అసోసియేషన్, ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వీరికి మద్దతు ప్రకటించారు. సమావేశంలో సంఘం నాయకులు విఠల్‌రెడ్డి, చంద్రకాంత్, రాము తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పౌల్ట్రీ రైతులప్రతినిధులు

## క్లుప్తంగా

### రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు ఎంపిక



రాజంపేట: ఉప్పల్ వాయి టీఎస్‌డబ్ల్యూఎస్ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నెట్‌బాల్ క్రీడలో రాజంపేట మండలం తలమడ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన రావుల గిల్షన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీ అరుణతో పాటు ఉపాధ్యాయ బృందం, రావుల గిల్షన్‌ను అభినందించారు.

### కానిస్టేబుల్‌కు డాక్టరేట్



కామారెడ్డి టౌన్: పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కామారెడ్డి పట్టణానికి చెందిన కానిస్టేబుల్ పుట్ల అనిల్‌కుమార్ గురువారం డాక్టరేట్ పట్టా పొందారు. రాజస్థాన్‌లోని మాధవ్ యూనివర్సిటీలో జంతుశాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాలలో రక్తదాతల సమూహం, ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ల ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆర్కే కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, ప్రిన్సిపాల్ దత్తాద్రి, తదితరులు పాల్గొన్నారు.

### ఎల్లారెడ్డిలో ఎగిరేది వైఎస్‌ఆర్‌టీపీ జెండానే



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో ఎగిరేది వైఎస్‌ఆర్‌టీపీ జెండాయేనని ఎల్లారెడ్డి కో–ఆర్డినేటర్ జమునా రాథోడ్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డిలో వైఎస్‌ఆర్‌టీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జమునా రాథోడ్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డిలో కచ్చితంగా వైఎస్‌ఆర్‌టీపీ పోటీ చేస్తుందన్నారు. ఎల్లారెడ్డిలో వైఎస్‌ఆర్‌టీపీ గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నరేష్, హరిలాల్, మధుసూదన్‌రెడ్డి, రవి, రాజు తదితరులున్నారు.

### 'ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయండి'

కామారెడ్డి క్రైం: ప్రతి పౌరుడు తమ దృష్టికి వచ్చిన ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ గురువారం తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నా రు. ఫిర్యాదు అందిన వంద నిమిషాల్లో స్పందించి చర్యలు తీసుకుంటామని వివరించారు. జిల్లాలో సీ–విజిల్‌కు ఇప్పటివరకు వచ్చిన 21 ఫిర్యాదులపై తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకున్నామన్నామని తెలిపారు. అంతే కాకుండా 1950 టోల్ ఫ్రీ నంబరుకు ఓటరు కార్డు, పోలింగ్ స్టేషన్ తదితర వివరాల కోసం 817 మంది ఫోన్ చేయగా అందరికీ సమాధానాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఎన్నికల వేళ నగదు, మద్యం, తాయిలాల ప్రవాహాన్ని అరికట్టడానికి చెక్ పోస్టుల వద్ద గట్టి నిఘా ఉంచామని, ఇప్పటివరకు రూ. 1.54 కోట్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆబ్కారీ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రూ. 1.25 కోట్ల విలువ చేసే 54,935 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకుని కేసులు నమోదు చేశామని తెలిపారు.

# అభ్యర్థి ఎవరైనా ప్రచారంలో వారే..

- ర్యాలీలు, ప్రచారాలకు తరలివస్తున్న మహిళా సంఘాల సభ్యులు
- బైకు ర్యాలీల్లో యువకులు
- ఓటరు నాడి తెలవక తలలు పట్టుకుంటున్న నాయకులు






ఆర్మూర్: బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ.. ఏ పార్టీ ర్యాలీ నిర్వహించినా.. ప్రచారం నిర్వహించినా అధిక సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు, కుల సంఘాల సభ్యులు, యువజన సంఘాల సభ్యులు హాజరై ఆ ర్యాలీలను విజయవంతం చేస్తున్నారు. అయితే ఏ పార్టీ, అభ్యర్థి ఎవరు అన్న ప్రశ్న లేకుండా అన్ని పార్టీల ప్రచార కార్యక్రమాల్లో వీరే పాల్గొంటుండడంతో ఓటరు నాడి అర్థం కాక రాజకీయ పార్టీల నాయకులు, విశ్లేషకులు తలలు పట్టుకుంటున్నారు. పార్టీ ఏదైనా ఆయా పార్టీల నాయకులు ఇస్తున్న డబ్బుల కోసం మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు సైతం తమ బల నిరూపణ చేసుకోవడం కోసం ప్రచార కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళలు, యువజన సంఘాల సభ్యులను తరలిస్తున్నారు.

**ఒక్కొక్కరికి రూ. రెండు వందల నుంచి..**

ప్రచార కార్యక్రమాలకు హాజరయ్యే మహిళలకు రోజుకు రూ. రెండు వందల నుంచి రూ. మూడు వందల వరకు చెల్లిస్తున్నట్లు డబ్బులు పంపిణీ చేస్తున్న నాయకులే బహిరంగంగా సమాచారం ఇస్తున్నారు. ఇక మోటార్ సైకిల్ ర్యాలీల్లో పాల్గొనడానికి వస్తున్న యువతకు ఒక్కో మోటార్ సైకిల్‌కు రూ. ఐదు వందలు, కారుకు రూ. 15 వందలు చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. మహిళలు, యువకులు, కుల సంఘాల సభ్యులు ఎవరికి ఓటు వేయాలో ఇప్పటికే నిర్ణయించుకున్నారో, లేదో అర్థం కాని పరిస్థితుల్లో పెద్ద ఎత్తున జన సమీకరణతో ప్రత్యర్థులకు దడ పుట్టించాలని తద్వారా తాము గెలుస్తున్నామన్న టాక్‌ను సృష్టించాలని వివిధ పార్టీల అసెంబ్లీ అభ్యర్థులు పోటీ పడి మరీ ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది.

**అన్ని నియోజకవర్గాల్లో..**

ప్రచారానికి ఈ జన సమీకరణ చేసే విధానం కేవలం ఆర్మూర్ నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాకుండా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కొనసాగుతోంది. అయితే అన్ని పార్టీల ప్రచారానికి వారే రావడాన్ని గుర్తించిన స్థానిక ప్రజలు ప్రత్యేకంగా ఈ వ్యవహారంపై చర్చించుకుంటున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, తమ పార్టీల మేనిఫెస్టోలతో పాటు భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధికి చేయాలనుకుంటున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తే సరిపోయేదానికి ఇలా పెద్ద ఎత్తున జన సమీకరణ చేసి ర్యాలీల ద్వారా ప్రచారం నిర్వహించడం వల్ల అబాసు పాలు కావడం తప్ప ఒరిగేదేమీ లేదని ప్రజలు, ఓటర్లు చర్చించుకుంటున్నారు.

## హ్యాట్రిక్ వీరులు.. నేరేళ్ల, ఏనుగు

- ఎల్లారెడ్డిలో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపు


నేరేళ్ల ఆంజనేయులు


ఏనుగు రవీందర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట: ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన నేరేళ్ల ఆంజనేయులు, ఏనుగు రవీందర్‌రెడ్డి ఎల్లారెడ్డి హ్యాట్రిక్ వీరులుగా నిలిచారు. 1967లో కామారెడ్డి నుంచి విడిపోయి ప్రత్యేక నియోజకవర్గంగా ఏర్పడింది. దీంతో నాటి నుంచి నేటి వరకు టీడీపీ అభ్యర్థిగా నేరేళ్ల ఆంజనేయులు, బీఆర్‌ఎస్ అభ్యర్థి గా ఏనుగు రవీందర్‌రెడ్డి ఎన్నికల్లో పోటీచేసి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. 1989లో తొలిసారి ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెట్టిన నేరేళ్ల ఆంజనేయులు తర్వాత 1994, 1999లో వరుసగా నిర్వహించిన ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో వరుసగా మూడుసారు ఎమ్మెల్యేగా గెలుపొంది ఆయన హ్యాట్రిక్ సాధించారు. కాగా 2004లో జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఏనుగు రవీందర్‌రెడ్డి 2008లో ఎల్లారెడ్డి స్థానానికి నిర్వహించిన ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి జనార్దన్‌గౌడ్ చేతిలో ఓటమి చెందారు. కానీ ఆ తర్వాత 2009లో జరిగిన సాధారణ ఎన్నికలతోపాటు 2010లో జరిగిన ఉపఎన్నికల్లో, 2014లో సాధారణ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఏనుగు రవీందర్‌రెడ్డి వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది హ్యాట్రిక్ సాధించారు.

## పోలీసుల ఫ్లాగ్ మార్చ్



ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలు గురువారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. నగరంలోని ఒకటి, రెండవ, నాలుగవ, ఆరవ పీఎస్ ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. ప్రజలు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్ పాత కలెక్టరేట్ కార్యాలయం నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ చౌరస్తా, విజయ్ థియేటర్, ఎల్లమ్మ గుట్ట, ఎల్ఐసీ ఆఫీస్, పులాంగ్ చౌరస్తా, రాజరాజేంద్రచౌరస్తా, లక్ష్మీ మెడికల్, నెహ్రూ పార్క్ వరకు నిర్వహించారు. అంతేకాకుండా అర్సపల్లి కమాన్ తదితర ప్రాంతాల్లో చేపట్టారు. డీసీపీలు ఎస్ జయరాం, గిరి రాజు, జితేందర్ సదావత్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐలు, ఎస్సైలు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

### రూ. 2 కోట్లకుపైగా నగదు రిలీజ్

సుభాష్‌నగర్ : అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మోడల్ కోడ్‌లో భాగంగా పోలీస్, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాయి. దీంట్లో భాగంగా ఇప్పటివరకు 102 కేసులు నమోదు చేసి రూ. 3,92,45,330ల ఆధారాలు చూపని నగదు, బంగారు, వెండి ఆభరణాలు సీజ్ చేశారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ విచారణ నిమిత్తం 83 కేసులకు సంబంధించి రూ.2,18,03,178 నగదును రిలీజ్ చేశారు. రెండు కేసులకు సంబంధించి రూ. 1,04,85,500 నగదును ఆదాయపన్ను శాఖకు అప్పగించారు. మరో రెండు కేసులకు సంబంధించి రూ. 33,74,605 నగదును ఆదాయ పన్నుశాఖకు సిఫార్సు చేశారు. అలాగే 15 కేసుల సంబంధించి రూ.35,82,047 నగదుపై విచారణ చేపట్టాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

## ప్రచారంలోకి మదన్ మోహన్ కుటుంబం


రామారెడ్డిలో ప్రచారం చేస్తున్న మదన్ మోహన్ తండ్రి, తల్లి, సోదరి, కుమార్తె

రామారెడ్డి (ఎల్లారెడ్డి): ఎన్నికల్లో గెలుపు కోసం మదన్ మోహన్ కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచార రంగంలోకి గురువారం దిగారు. మదన్ మోహన్ రావు కుటుంబానికి రామారెడ్డితో దగ్గర సంబంధం ఉంది. తండ్రి రాజేశ్వరరావు పదిహేనేళ్ల పాటు రామారెడ్డిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. అప్పటి విద్యార్థులను పలకరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. గురువు రుణం తీర్చుకోవాలని కోరుతున్నారు. మదన్ మోహన్‌రావు సోదరి సైతం ఇక్కడే చదువుకున్నారు. ఒక్క రామారెడ్డిలోనే 6,540 ఓట్లు ఉండడంతో మదన్ మోహన్ రావు కుటుంబం ప్రత్యేకంగా ఎంచుకొని ప్రతి ఇంటికి తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు.

## గొంతులో సలాకా దిగి నరకయాతన

- సెప్టిక్ ట్యాంకు గుంతలో పడడంతో ప్రమాదం
- ఆపరేషన్ చేసి తొలగించిన వైద్యులు



కామారెడ్డి టౌన్: ప్రమాదవశాత్తూ మెట్లపైనుంచి జారి నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంకు గుంతలో పడడంతో ఓ కూలీ గొంతులో సలాకా గుచ్చుకుంది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన జనార్దన్ రోజూ జిల్లా కేంద్రంలోని జేపీఎన్ చౌరస్తాలో ఉన్న కూలీల అడ్డా వద్దకు వచ్చి పని వెతుక్కుంటాడు. గురువారం ధరణి టౌన్‌షిప్‌లో భవన నిర్మాణ పనులకు కూలీగా వెళ్లాడు. పనులు చేస్తుండగా మెట్ల మీద నుంచి జారీ నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్ గుంతలో పడిపోయాడు. ఈ క్రమంలో అతని గొంతులో ఓ ఇనుప సలాకా దిగింది. దీంతో నరకయాతన అనుభవించాడు. దీనిని గమనించిన మేస్త్రీలు, కూలీలు కట్టర్‌తో సలాకాను కట్ చేసి 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వైద్యులు శస్త్ర చికిత్స చేసి సలాకాను తొలగించారు. ఇన్‌ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఉండడంతో వైద్యులు మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌కు పంపించారు.

## వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి


మహేశ్ (ఫైల్)

వర్ని: మండలంలోని సిద్దాపూర్‌కు చెందిన బాదావత్ మహేశ్(22) ఆదిలాబాద్ జిల్లా నేరేడుగొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై గ్రామానికి చెందిన మహేశ్, రాజేశ్‌లు నేరేడుకొండలో ట్రాక్టర్ డ్రైవర్, క్లీనర్‌గా పనిచేస్తున్నారు. రాత్రి నేరేడుకొండ సమీపంలో బైక్ ఎదురుగా వస్తున్న బస్సు వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో మహేశ్ అక్కడికక్కడే మృతి చెందడగా రాజేశ్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

**రోడ్డు ప్రమాదంలో ఒకరు..**


గంగాధర్(ఫైల్)

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని మున్సిపల్ స్పెషల్ టీం 2లో పనిచేస్తున్న కార్మికుడు రంజిత్ అలియాస్ గంగాధర్ డిచ్‌పల్లి మండలంలోని గొల్లపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాజ్ తెలిపారు. ముబారక్‌నగర్‌కు చెందిన గంగాధర్ మూడేళ్లుగా మున్సిపల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు.

### డెంగీతో ఆఫీస్ సబార్డినేట్..

నిజామాబాద్ రూరల్: డెంగీతో రూరల్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో సబార్డినేట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జగన్ (29) మృతి చెందినట్లు ఎంపీడీవో మల్లేశ్ గురువారం తెలిపారు. గత రెండేళ్లుగా కార్యాలయంలో విధులు నిర్వరిస్తున్న జగన్ మూడు రోజుల క్రితం డెంగీతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆరోగ్యం పూర్తిగా క్షీణించడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కార్యాలయ సిబ్బంది, అధికారులు జగన్ మృతికి ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బీజేపీ అభ్యర్థుల బయోడేటా..

### బాన్సువాడ



అభ్యర్థి పేరు : యెండల లక్ష్మీనారాయణ
పుట్టిన తేదీ : మార్చి 1, 1963
వయస్సు : 60
విద్యార్హత : బీఏ(ఎల్‌ఎల్‌బీ)
తల్లిదండ్రులు : బుచ్చమ్మ, యెండల చిన్నయ్య (మాజీ మున్సిపల్ కౌన్సిలర్)
: భార్య, ఇద్దరు పిల్లలు

**రాజకీయ ప్రస్థానం:**

- ఆర్ఎస్ఎస్ సంఘ్ కార్యకర్త. 1980లో బీజేపీలో సభ్యత్వం.
- పట్టణ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి, అధ్యక్షుడు. ఉమ్మడి జిల్లా బీజేవైఎం ప్రధాన కార్యదర్శి, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడిగా విధులు.
- 1998లో సింగూరు జలాల కోసం రైతు నిరవధిక దీక్షలో భాగంగా లాఠీచార్జీలో తీవ్ర గాయాలు.
- 1999 అర్బన్‌లో డీఎస్ చేతిలో స్వల్ప తేడాతో ఓటమి
- 2001లో ఉమ్మడి జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నిక.
- 2007 నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు.
- 2009లో అర్బన్ ఎమ్మెల్యేగా డీఎస్‌పై గెలుపు
- 2009లో తెలంగాణ ఉద్యమంలో ప్రజల అభీష్టం మేరకు ఎమ్మెల్యే పదవికి రాజీనామా.
- 2010లో ఉపఎన్నికల్లో తిరిగి డీఎస్‌పై విజయం.
- 2014 ఎంపీగా పోటీచేసి ఓటమి.
- 2014 – 2020 కోర్ కమిటీ సభ్యుడిగా విధులు
- 2018లో ముత్యంపేట నుండి బోధన్ వరకు నిజాంషుగర్స్ పునఃప్రారంభించాలని పాదయాత్ర
- 2018లో అర్బన్ ఎమ్మెల్యేగా పోటీ, ఓటమి. 2020 నుంచి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా విధులు.

### బోధన్



అభ్యర్థి పేరు : వడ్డి మోహన్ రెడ్డి
వయస్సు : 55
తల్లిదండ్రులు : ధనలక్ష్మి, వీరారెడ్డి
భార్య : లక్ష్మి
కుమారులు : ఆశిష్ రెడ్డి, ధీరజ్ రెడ్డి
గ్రామం : రెడ్డి ఫారం, జీపీ మోకన్‌పల్లి, నవీపేట మండలం
విద్యార్హత : బీకాం

**రాజకీయ ప్రస్థానం:**

- ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు
- 1990–2018 వరకు టీడీపీ జిల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా విధులు
- 1995–2000 వరకు నిజామాబాద్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడిగా..
- 2000–2005 వరకు సారంగాపూర్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ చైర్మెన్
- 2006–2011 నవీపేట జెడ్పీటీసీ సభ్యుడు, టీడీపీ జెడ్పీ ఫ్లోర్ లీడర్
- 2018–2022 బీఆర్‌ఎస్‌లో చేరిక
- 2022 ఆగస్టులో బీజేపీలో చేరారు.
- ప్రస్తుతం ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా..
- తెలంగాణ రాష్ట్ర రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు.
- నిజామాబాద్ గోశాల కమిటీ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.
- జిల్లా కేంద్రంలోని రఘునాథ ఆలయం(ఖిల్లా), శ్రద్ధానంద్‌గంజ్ ఉమామహేశ్వర ఆలయ ట్రస్టీగా ఉన్నారు.

### నిజామాబాద్ రూరల్



అభ్యర్థి పేరు : కులాచారి దినేశ్ కుమార్
పుట్టిన తేదీ : ఆగస్టు 31, 1972
వయస్సు : 51
విద్యార్హత : సివిల్ ల్యాబ్ టెక్నీషియన్
తల్లీతండ్రి : అనసూయ, మధుసూదన్‌రావు
భార్య : దివ్య
కుమారులు : కిరణ్, ఉదయ్
గ్రామం : అమృతాపూర్, డిచ్‌పల్లి మండలం

**రాజకీయ ప్రస్థానం:**

- తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి రాక
- విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, యువజన విభాగం రాష్ట్ర కోశాధికారి, ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు.
- తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు.
- తెలుగుదేశం పార్టీ నుంచి డిచ్‌పల్లి జెడ్పీటీసీగా గెలుపొందారు.
- జిల్లా ప్రణాళిక సంఘం సభ్యుడిగా ఉన్నారు.
- నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆయన భార్య దివ్య పనిచేశారు.
- డిచ్‌పల్లిలో మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు గెలుపులో కీలకపాత్ర పోషించారు.
- రూరల్ ఎమ్మెల్యేగా బాజిరెడ్డి గోవర్ధన్ గెలుపులో రెండు సార్లు ప్రధాన భూమిక
- 2021 జనవరి 3న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా, ఎంపీ ధర్మపురి అర్వింద్ సమక్షంలో 10 మంది సర్పంచ్‌లు, 10 మంది ఎంపీటీసీలు, ఒక ఎంపీపీ, వైస్‌ఎంపీపీ, మాజీ సర్పంచులతో బీజేపీలో చేరారు.

## ఆధార్ కేంద్రంలో అక్రమ వసూళ్లు

- చేతివాటం ప్రదర్శిస్తున్న నిర్వాహకుడు
- పట్టించుకోని అధికారులు


ఆధార్ కేంద్రానికి వచ్చిన ప్రజలు

బిచ్కుంద: మండల కేంద్రంలోని ఆధార్ సెంటర్‌లో సదరు నిర్వాహకుడు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నాడు. నిబంధనలకు విరుద్ధంగా ఆధార్ సెంటర్‌కు వచ్చే ప్రజల నుంచి అధిక ఫీజు వసూలు చేస్తున్నాడు. ఇదేంటని ప్రశ్నించిన వారికి చేతి వేలి ముద్రలు రావడం లేదని, సర్వర్ సరిగా రావడం లేదంటూ నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నాడు. దీంతో అమాయక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఆధార్ కార్డులో పేర్లు, చిరునామాలు, బయోమెట్రిక్ చేసుకునేందుకు వస్తుంటారు. మండల కేంద్రంలో ఒకటే సెంటర్ కావడంతో సదరు నిర్వాహకుడు ఆడిందే ఆట పాడిందే పాటగా మారిపోయింది. ప్రభుత్వం ఆధార్ కేంద్రం నిర్వహణకు ఓ సంస్థకు కమీషన్‌పై ఒప్పందం చేసుకుంది. బిచ్కుంద బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఆధార్ సెంటర్ నిర్వహణకు ఓ నిర్వాహకుడికి ఉచిత కరెంట, గది, ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించింది. కొత్త కార్డులు, చిరునామాలు, వేలిముద్రల నమోదు బయోమెట్రిక్, తప్పుగా ఉన్న పేర్లను సరి చేసేందుకు ప్రభుత్వం ఆధార్ కేంద్రాలకు వెళ్లి చేసుకోవాలని సూచించడంతో ప్రజలు బిచ్కుందలో ఆధార్ కేంద్రానికి అధిక సంఖ్యలో వస్తున్నారు.

దీంతో సదరు నిర్వాహకుడు రసీదు నుంచి అదనంగా రూ. యాభై నుంచి రూ. వంద వరకు అధికంగా తీసుకుంటున్నాడు. అదనంగా డబ్బులు ఇవ్వకుంటే ఆధార్‌కార్డులో పలు సమస్యలు ఉన్నాయంటూ మూడు రోజుల పాటు సదరు సెంటర్ వెంట తిప్పుతున్నాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పలువురు బాధితులు బీఎస్ఎన్ఎల్, రెవెన్యూ అధికారులు, ఒప్పందం చేసుకున్న సంస్థ యజమానులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### బీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ప్రభుత్వ విప్


ఎమ్మెల్యే జాజాల సమక్షంలో..ఉత్తనూరువాసులు

కామారెడ్డి క్రైం: నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కామారెడ్డి మండలం టేక్రియాల్, దేవునిపల్లి, నర్సన్నపల్లి, రాఘవపూర్, ఉగ్రవాయి గ్రామాలకు చెందిన 400 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. రాఘవపూర్‌కు చెందిన చెందిన పలు కుల సంఘాలు కేసీఆర్‌కు మద్దతుగా తీర్మానాలు చేసి ప్రభుత్వ విప్‌కు అందజేశాయి. గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు.

**సదాశివనగర్‌లో..**

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఉత్తనూర్, పద్మాజీవాడి, అడ్లూర్‌ఎల్లారెడ్డి, లింగంపల్లి తదితర గ్రామాలకు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే జాజాల సురేందర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. జెడ్పీటీసీ కమిలి నర్సింలు, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి, విండో చైర్మన్లు మర్రి సదాశివరెడ్డి, కమలాకర్ రావు, ఎంపీటీసీ రాంచందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**బీబీపేట నుంచి..**

బీబీపేట: మండలంలోని ఇస్సానగర్ గ్రామానికి చెందిన పలువురు గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్ వారికి కండువాలు కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్, తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీపీ బాలమణి ఉన్నారు.

## తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యం


జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సదాశివనగర్‌లో..

సాక్షి నెట్‌వర్క్:జిల్లాలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. తెలంగాణ అభివృద్ధి కేసీఆర్‌తోనే సాధ్యమని, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీజేపీ నేతల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. మరోమారు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

## క్రైం కార్నర్

### ఏటీఎంలలో చోరీకి యత్నం

సదాశివనగర్: మండల కేంద్రంలోని కో–ఆపరేటీవ్ బ్యాంక్, ప్రైవేట్ బ్యాంక్ ఏటీఎంలో ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి యత్నించినట్లు పోలీసులు తెలిపారు. సీసీ పుటేజీల ఆధారంగా చోరీకి యత్నించిన ఇద్దరు వ్యక్తులు మండలంలోని తిర్మన్‌పల్లికి చెందిన వారుగా గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

**ఎత్తొండలో..**

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ గ్రామంలోని ఓ ఇంట్లో దుండగులు చోరీ చేసినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన మంత్రి పోశవ్వ మూడు రోజుల క్రితం ఇంటికి తాళం వేసి బోధన్‌లో ఉండే కూతురు దగ్గరకు వెళ్లింది. గురువారం స్వగ్రామానికి రాగా ఇంటి తాళం పగలగొట్టి ఉండడం బీరువాలో ఉన్న రూ.20వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### పిచ్చి కుక్క దాడిలో బాలికకు గాయాలు

డిచ్‌పల్లి: మండలంలోని నడిపల్లి తండాలో ఇంటిముందు ఆడుకుంటున్న చిన్నారి రిషికపై పిచ్చికుక్క దాడి చేసింది. దీంతో చిన్నారి మొఖంపై ఇరువైపులా తీవ్ర గాయాలయ్యాయి. చిన్నారి కేకలకు బయటకు వచ్చిన కుటుంబీలు కుక్కను తరిమివేశారు. గాయపడిన బాలికను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మూడు రోజులుగా తండాలో పిచ్చికుక్క సంచరిస్తుందని పంచాయతీ సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని తండా వాసులు పేర్కొంటున్నారు.

### తనిఖీల్లో నగదు పట్టివేత



వర్ని/ మోపాల్: వర్ని పీఎస్ పరిధిలోని మల్లారం శివారులో వాహనాల తనిఖీల్లో రూ. 2,20,420 నగదును పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణకుమార్ గురువారం తెలిపారు. ఈ నగదును నలుగురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్నామని వారు ఎలాంటి ఆధారాలు చూయించకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మోపాల్ మండల కేంద్రంలోని శివారులో పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీల్లో రూ.70వేలు పట్టుకున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.